www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 అక్టోబరు 2024
5
చిత్తూరు

కలెక్టర్‌ను కలిసిన పలమనేరు ఆర్‌డిఓ

కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పలమనేరు ఆర్‌డివో వెంకటేష్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పలమనేరు ఆర్‌డిఓగా నియమితులైన వెంకటేష్ కలెక్టర్ సుమిత్ కుమార్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పలమనేరు ప్రాంతంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఉచిత ఇసుక ఎక్కడ?

- కుశస్థలిలో ఇసుక వున్నా దారి లేదు..
- ఓ రైతు పొలంపై వెళ్లాలంటే ట్రిప్పుకు రూ. 500లు చెల్లించాలి
- టిడిపి నాయకులకు ఒత్తాసు పలుకుతున్న అధికారులు

ప్రజాశక్తి -విజయపురం

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితం అని చెప్పినా...విజయపురం మండలంలో అది ఎక్కడా అమలు కావటం లేదు. కేవీ శ్రీరామపురం వద్ద కుశస్థలి నదిలో ఇసుక వుంది. కానీ ట్రాక్టర్ వెళ్లడానికి దారి లేదు. దీంతో ఇసుక దొరకడం కష్టంగా మారింది. దీన్ని అదునుగా తీసుకొని కొందరు ట్రాక్టర్ యజమానులు ట్రాక్టర్ ఇసుకను రూ. 5 వేలుకు అమ్ముకొంటున్నారు. అయితే ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళితే.. రూ. 5వేలుకు ఇసుక అమ్ముతున్న వారి వద్ద ఇసుక కొనుగోలు చేయవద్దని ఉచిత సలహా ఇస్తున్నారే తప్ప...ఎక్కువ ధరకు ఇసుక అమ్ముతున్న ట్రాక్టర్ యజమాన్యంపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై స్థానిక ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కుశస్థలి నదికి వెళ్లాలంటే దారి లేదు..

విజయపురం మండలంలోని కేవీ శ్రీరామపురం కుశస్థలి నదిలో వెళ్లడానికి దారి లేదు. ఇటీవల ఇసుక తరలించకుండా అధికారులు దారిని మూసి వేశారు. అంతే కాకుండా ఇటీవల వరదకు దారి కొట్టుకొని పోవడంతో దారి పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఇసుక ఉన్నా ట్రాక్టర్ వెళ్లడానికి దారి లేకపోవడంతో బయట వ్యక్తుల వద్ద అధిక ధరలకు ఇసుక కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు పొలంలోనే దారి

కుశస్థలి నదిలో దారి లేకపోవడంతో స్థానికంగా ఉన్న ఓ రైతు దీన్ని ఆసరగా చేసుకుని తన పొలంలో దారి ఏర్పాటు చేసుకున్నాడు. ఆ రైతు తన ట్రాక్టర్‌ను నదిలోకి తీసుకెళ్లి ఇసుక తీసుకొని వచ్చి మండలంలో రూ. 5వేలు విక్రయించుకొని సొమ్ము చేసుకొంటున్నాడు. ఎందుకంటే తన ట్రాక్టర్ తప్ప, మిగిలిన వారు ఎవ్వరూ ఆ దారిలో వెళ్లకూడదని ఆ రైతు హెచ్చరిస్తున్నాడు. వెళితే ఓ ట్రాక్టరుకు రూ. 500 వసూలు చేస్తున్నాడు. దీంతో ఇసుకకు డిమాండ్ ఎక్కువైంది. ఇప్పటికైనా అధికారులు కుశస్థలి నదిలో దారి ఏర్పాటు చేస్తే ఇసుక ఉచితంగా లభిస్తుందని వెంటనే దారి ఏర్పాటు చేయాలని ట్రాక్టర్ యజమానులు కోరుతున్నారు.

దారి కరువైన కుశస్థలి నది

ఏనుగు దాడిలో వ్యక్తి దుర్మరణం

- మృతుని కుటుంబానికి రూ.10లక్షల సాయం
- ఐదు నెలల్లో ఇద్దరు మృతి..
- హడలెత్తున్న జనం
- సోలార్ ఫెన్సింగ్, కందకాలు పూర్తి చేయాలంటున్న ప్రజలు

మృతుడు రెడ్డు నాయక్ (ఫైల్‌ఫొటో), ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి - రామకుప్పం: చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యం సమీపంలో ఒంటరి ఏనుగు ఓ వ్యక్తిపై దాడి చేసి తొక్కి చంపిన సంఘటన రామకుప్పం మండలంలో చోటు చేసుకుంది. ఐదు నెలల వ్యవధిలో ఇది రెండవ సంఘటన కావటం దురదృష్టకరం. స్థానికుల కథనం మేరకు.. రామకుప్పం మండల పరిధిలోని పీఎంకే తాండా సమీపంలోని సాకలినత్తం కొండ ప్రాంతంలో గ్రామానికి చెందిన రెడ్డు నాయక్ (47)పై మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేయటంతో

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

అతను మృతి చెందాడు. రెడ్డు నాయక్ వ్యవసాయ కూలీగా పనులు చేసుకుంటూ జీవించేవాడు. రెండు నెలల కిందట మృతుడి భార్య ప్రమీల ఆనారోగ్యంతో మృతిచెందింది. అప్పటినుంచి తరచు రెడ్డు నాయక్ అటవీ సరిహద్దు సమీపంలో ఉన్న స్మశానంలోని సమాధి వద్దకుకు వెళ్లి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలో మంగళవాళం వెళ్లి తిరిగి వస్తుండగా అతనిపై ఏనుగు దాడి చేయటంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి సైరాజ్ అనే ఓ కుమారుడు ఉన్నాడు. బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా అటవీ అధికారి భరణి, డాక్టర్ సురేష్ మృతుని కుమారుడికి రూ.10లక్షల చెక్కును అందించారు. అనంతరం ఘటనా స్థలాన్ని కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎఫ్ఆర్ఓ జయశంకర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇక్కడి సమీపంలోని పిఎం తాండా వద్ద జూన్ 16వ తేదీన కన్నా నాయక్ ఒంటరి ఏనుగు దాడిలో మరణించారు. తరచు ఏనుగులు గ్రామాలపై పడి మనుషుల ప్రాణాలు తీస్తుండడంతో అటవీ సరిహద్దు ల్లోని గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలెత్తి పోతున్నారు. ఏనుగు దాడులకు శాశ్వత పరిష్కారం చూపటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని కుప్పం నియోజకవర్గ అటవీ సరిహద్దు ప్రాంతం చుట్టూ అసంపూర్తిగా మిగిలి ఉన్న కందకాలు పూర్తి చేయించడంతో పాటు సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని అటవీ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

స్కీమ్, కాంట్రాక్టు వర్కర్స్‌ను వేధించొద్దు..

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి సురేంద్రన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్కీమ్, కాంట్రాక్టు వర్కర్స్‌ను వేధించ వద్దని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంజీవరం సురేంద్రన్ కోరారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా అధ్యక్షత బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ మాట్లాడుతూ జిల్లాలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను చాలా ప్రాంతాల్లో డ్యూటీలు చేయవద్దని రాజకీయంగా కొంతమంది వేధిస్తున్నారని, ఇలా వర్కర్లను వేధిచడం సరికాదన్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో వున్న ప్రభుత్వం ఉద్యోగులను వేధింపులకు గురిచేయడం వల్లే వారు ఓడిపోయారన్నారు. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే వైఖరితో వెళితే కచ్చితంగా నష్టపోతారని హెచ్చరించారు. ఉద్యోగులకు, కార్మికులకు అన్యాయం జరిగేలా చర్యలను తీసుకోవద్దని సిఐటియు జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడాలని, చిత్తూరు జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ద్వారా ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, కార్మికులను హింసించకుండా రక్షించాలన్నారు. ఈనెల 26వ తేదీన సిపిఎం 14వ జిల్లా మహాసభల సందర్భంగా జరిగే ర్యాలీలో జిల్లా వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, ఎం జ్యోతి, గిరిధర్ గుప్తా పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు లీకేజి

స్పందించని మండల కార్యాలయ అధికారులు

ప్రజాశక్తి విజయపురం : మండలానికి ఆదర్శంగా ఉండాల్సిన అధికారులే అలసత్వం ప్రదర్శిస్తున్నారు. విజయపురం మండలం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తాగునీటి ట్యాంకు వుంది. అయితే అక్కడ పైపు లైన్ లీకేజ్ అయి పారిశుధ్యం పూర్తిగా లోపించింది. అధికారులు మౌనంగా చూస్తున్నారే తప్ప, వాటిని ఇంత వరకు సరి చేయలేదు. దీంతో అది పాచి పట్టిపోయింది. కళ్ల ఎదుటే వున్నా వాటిని పట్టించుకొని అధికారి, పల్లెలో ఉన్న సమస్యలు ఎలా తీరుస్తారని కార్యాలయానికి వచ్చే ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. అంతే కాకుండా గ్రామాభివృద్ధి కోసం వచ్చే నిధులు తప్పుడు లెక్కలు చూపి అధికారులు స్వాహ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై స్పందించాలని కోరుతున్నారు.

తాగునీటి ట్యాంకు లీకేజి కారణంగా బురదమయమైన మండల కార్యాలయ పరిసరాలు

రాష్ట్ర స్థాయికి 'చందం' క్రీడాకారిణులు

ప్రజాశక్తి -కుప్పం రూరల్ : కుప్పం మండలం చందం గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్కొండనాయుడు తెలిపారు. నగరి మండలం ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అండర్ 14 క్రీడా పోటీలలో భాగంగా నెట్ బాల్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలలో తమ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న రమ్య, రంజితలు ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ నెల రెండవ వారం విశాఖపట్నం జిల్లా గాజువాకలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారని జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారిణులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుణులు

దారి సమస్య పరిష్కారం

జెసికి యానాదుల కృతజ్ఞతలు

సమస్య పరిష్కారంతో ఆనందం వ్యక్తం చేస్తున్న యానాదులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తాము అడవికి వెళ్లే దారిని ఆక్రమించుకుని కొందరు ఇబ్బందులకు గురిచేశారంటూ ఈనెల 21వ తేదీ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జాయింట్ కలెక్టర్ విద్యాధరికి తవణంపల్లి మండలం మల్లంకుంట పంచాయతీ, రామనాథ్‌పురం ఎస్టీకాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. సమస్యపై స్పందించిన జేసి వెంటనే తవణంపల్లి తహశీల్దారుకు ఫోన్ ద్వారా గిరిజనకాలనీ దారి సమస్యను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం తహశీల్దారు తన సిబ్బందితో రామనాథ్‌పురం ఎస్టి కాలనీకి చేరుకొని దారి సమస్యను పరిశీలించారు. దారిని ఆక్రమించిన వ్యక్తితో మాట్లాడి దారి సమస్య పరిష్కరించారు. దీంతో గిరిజన కాలనీ ప్రజలు జాయింట్ కలెక్టర్ విద్యాధరికి, తవణంపల్లి తహశీల్దార్లకు కృతజ్ఞతలు తెలిపారు.

అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలిక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీగా) నాగేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన చిత్తూరు నగరపాలిక సంస్థ టీవోగా విధులు నిర్వహించారు. అప్పటి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు సంతపేట రోడ్డు, హైవే రోడ్డు, వైడ్డింగ్ చేసి ప్రజల మన్ననలు పొందారు. కరోనా సమయంలో నగర ప్రజల కోసం అనేక సేవాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం జరిగిన బదిలీలో కడప ఏసిపిగా వెళ్లారు. ప్రస్తుతం మళ్లీ బదిలీపై చిత్తూరు ఏసిపిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నగర మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను ఏసిపి నాగేంద్ర మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న నాగేంద్ర

ప్రజా ఫిర్యాదులపై దృష్టి పెట్టాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల వేదికలో అందే ప్రజా ఫిర్యాదులపై దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ సుమిత కుమార్ ఆదేశించారు. కలెక్టర్ బుధవారం జిల్లా సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ప్రజా సమస్య ల పరిష్కార వేదికలో అందే సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, సిఎంఓ గ్రీవెన్స్, రీ ఓపెన్ కేసులకు సంబంధించిన అర్జీల సంబంధిత అంశాలపై కలెక్టర్ ఈ సందర్భంగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత గా ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తోందన్నారు. ఈ అంశానికి అధిక ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారంలో అర్జీదారునికి అర్థ వంతమైన నాణ్యమైన ఎండార్స్‌మెంట్ ను ఇస్తూ పరిష్కారం చూపాలని ఈ విషయం లో అధికారులందరూ మరింత బాధ్యతా యుతంగా పని చేయాలని సూచించారు. జిల్లాలో 2024 జూన్ 15వ నుండి ఇప్పటి వరకు 8,996 ఫిర్యాదులు నమోదు కాగా 6,399 నిర్ణీత సమయంలో

పరిష్కారిం చామని, రీ ఓపెన్ కేసులలో 118 పెండింగ్‌లో ఉన్నాయని దీన్ని త్వరిత గతిన పరిష్కరిం చాలని, మిగిలిన అర్జీలు పరిష్కారానికి వివిధ దశలలో వున్నాయ న్నారు. అర్జీ దారునికి సంతృప్తికరమైన సమాధానం ఇస్తూ రీ ఓపెన్ కు అవకాశం లేకుండా పరిష్కారం చూపే విషయంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి గ్రీవెన్స్‌ను ఆడిట్ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సీఎం పోర్టల్ నుంచి హెచ్‌ఆర్‌డి నుండి ఇతర మంత్రుల పేషీ నుండి అందే అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన సర్వే ప్రక్రియను ఈ నెల 30వ తేదీ లోపు పూర్తిచేసేలా ఆర్డీఓలు, తహశీల్దారులతో సమన్వయం చేసుకో వాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా ఆధార్ కార్డు లేని గిరిజనులకు ఆధార్ కార్డు మంజూరు చేసే విషయంలో తహశీల్దార్, ఎంపీడీఓలు కలిసి పనిచేయాలని ఆదేశించారు.

ఎన్‌టిఆర్ జలాశయం నీటి విడుదల

- గేట్లు ఎత్తిన ఎమ్మెల్యేలు
- గంగా హారతి, సారె సమర్పణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు శివారులోని కల్వకుంట ఎన్టీఆర్ జలాశయం నీటితో నిండడంతో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్‌లు ప్రత్యేక పూజలు చేసి గంగా హారతి ఇచ్చి సారే సమర్పించారు. చిత్తూరు ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతి నిధులు మురకంబట్టు నుంచి ద్విచక్ర వాహనాలపై బుధవారం భారీ ర్యాలీగా ఎన్టీఆర్ జలాశయం వద్దకు చేరుకున్నారు. అనంతరం చిత్తూరు, పూతల పట్టు ఎమ్మెల్యేలు, మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్‌లు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్టీఆర్ జలాశయంపై వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాశయం నీటికి హారతి ఇచ్చారు. పసుపు, కుంకుమ, పండ్లు, పుష్పాలతో కూడిన సారెను జలాశయం నీటికి సమర్పిం చారు. అనంతరం రెండు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

జలహారతి ఇచ్చి నీటిని విడుదల చేస్తున్న ఎంఎల్‌ఏలు

అతి త్వరలో చిత్తూరుకు అడవిపల్లె రిజర్వాయర్ నీరు..

చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లా డుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాడు ఒక మంచి ఆలోచనతో ఎన్టీఆర్ జలాశయాన్ని నిర్మించా రని ఫలితంగా నేడు చిత్తూరు నగర ప్రజలతో పాటు.. పూతల పట్టు, జీడి నెల్లూరు నియోజక వర్గాల్లోని ప్రజల అవసరాలు తీరుస్తుం దన్నారు. ఎన్టీఆర్ జలాశ యం నుండి చిత్తూరు నగర నీటి అవసరాల కోసం 5 ఎంఎల్‌డి నీటిని వినియోగిస్తు న్నామని, అదనంగా మరో 5 ఎంఎల్‌డి నీటిని వినియో గించుకునేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పా రు. ఎన్నిక లకు ముందు చిత్తూరు నగర ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అడవి పల్లె రిజర్వా యర్ నుంచి అతి త్వరలోనే చిత్తూరుకు నీటి సరఫరా అవుతుందన్నారు. ఉన్న అడ్డంకులు అన్నిటిని తొలగించామని, ఇచ్చిన హామీని బాధ్యతా యుతంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్ మాట్లాడుతూ.. కరువు ప్రాంతమైన చిత్తూరు జిల్లాలో ఎన్టీఆర్ జలాశయాన్ని నిర్మించి చిత్తూరు, పూతలపట్టు, జేడి నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు ఎంతో మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. వృథాగా పోయే నీటికి అడ్డుకట్ట వేసి వ్యవసాయానికి దన్నుగా నిలిచారన్నారు.

సురక్షిత భవనానికి అంగన్‌వాడీ కేంద్రం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : కుప్పం పట్టణం కొత్తపేటలోని అంగన్‌వాడీ కేంద్ర భవన పరిస్థితిని వివరిస్తూ బుధవారం 'ప్రజాశక్తి' దినపత్రికలో వచ్చిన వార్త కథనంపై స్థానిక సిడిపిఓ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె ఆ అంగన్‌వాడీ కేంద్రాన్ని సురక్షిత భవనానికి మార్చాలని సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తను ఆదేశించారు. ఈ పనులను పర్యవేక్షించాలని సూపర్వైజర్ కు సూచించారు. భవన పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి అనుమతితో నిధులు మంజూరు అయిన వెంటనే అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేయించడంతో పాటు ప్రహరీ గోడ నిర్మించి, స్థానిక చిన్నారులకు, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతామని తెలిపారు.

ఉత్తమ సేవకు పురస్కారం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ దామోదరం బుధవారం చిత్తూరు ఎస్పి మణికంఠ చందోలు చేతుల మీదగా ప్రశంసా పురస్కారం అందుకున్నారు. చార్ట్ బాట్ యాప్ ద్వారా దామోదరం దాదాపు 70 ఫోనులు 2024 సంవత్సరానికి అతి తక్కువ వ్యవధిలో రికవరీ చేసి అప్పగించినందుకు ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది దామోదరం ను ప్రశంసించి అభినందనలు తెలిపారు.

అడిషినల్ ఎస్పిగా శివానంద కిషోర్ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న శివానందకిషోర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా ఏఆర్ అడిషినల్ ఎస్పిగా శివానందకిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పి విఎన్‌మణికంఠ చందోలును ఎస్పి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆర్ శివానంద కిషోర్ ఎంఎస్‌పి, బిఇడి, సైకాలజీలో పూర్తి చేసి 1992 బ్యాచ్ లో ఆర్‌ఎస్ఐగా పోలీసుశాఖలో చేరారు. మొదటి పోస్టింగ్‌లో తిరుపతి ఏఆర్‌లో ఆర్ఎస్ఐ గా పనిచేశారు. అనంతరం 2000 వ సంవత్సరంలో ఆర్ఐగా ఉద్యోగోన్నతి పొంది చిత్తూరు, తిరుపతిలో ఏఆర్‌లో పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వర్తించి 2011 వ సంవత్సరంలో డిఎస్పీ గా చిత్తూరులో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్‌గా పిటిసి కళ్యాణి డ్యాం లోను వైస్ ప్రిన్సిపాల్, తిరుమలలో విజిలెన్సు అధికారిగా పనిచేశారు. ప్రస్తుతం ప్రమోషన్‌పై చిత్తూరు జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పిగా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

మాట్లాడుతున్న కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్

విద్యార్థులు దుర్వ్యసనాలకు పోవద్దు: సిఐ

ప్రజాశక్తి - రామకుప్పం: విద్యార్థి దశలోనే విద్యార్థులు దుర్వ్యసనాలకు పోకుండా వాహనాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఏపీ మోడల్ స్కూల్ లో విద్యార్థిని విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. చెడు అలవాట్లకు, దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి చదువును అభ్యసించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ మూర్తి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సేవలు యాప్‌లో నమోదు చేయాలి'

ప్రాజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతిరోజూ ఆరోగ్యసేవలు అందిస్తూ యాప్ నమోదు చేయాలని డిఎం అండ్‌హెచ్ఒ డాక్టర్ ప్రభావతిదేవి ఆదేశించారు. బుధవారం జిల్లాలోని వైద్యాధికారులతో సంక్రమణ వ్యాధులు, మాతాశిశు ఆరోగ్యంపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్లు, గుండెజబ్బులు వంటి వ్యాధులపై ప్రతిరోజూ ఆరోగ్యసేవలు అందిస్తూ యాప్ నమోదు చేయాలన్నారు. ఆరోగ్య ఆసరా పెన్షన్ తాలూకా కొత్త విధివిధానాలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని మెడికల్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్లు మాత్రమే అంగీకరిస్తామని తెలిపారు.

25 నుంచి పశుగణన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ ద్వారా వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పశుసంరక్షణ కోసం ప్రభుత్వం పశు సంవర్ధకశాఖను ఏర్పాటు చేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పశువైద్యశాలలను ఏర్పాటు చేసి పశులు, మేకలు గొర్రెలు, కోళ్లకు వచ్చే వ్యాధులకు టీకాలను అందిస్తూ పశు, మేకలు గొర్రెలు, కోళ్ల రైతులకు ప్రోత్సహం అందిస్తూ అనేక పథకాలను అమలు చేస్తోంది.



జనాభా లెక్కలు గణించిన్నట్లే పశు వులను కూడా గణించేలా 1919-20లో జాతీయ పశుగణన చేపట్టారు. నాటి నుంచి ఐదేళ్లకోసారి పశుగణన చేపట్టి దేశవ్యాప్తంగా పశులను లెక్కిస్తున్నారు. ఈ మేరకు ఈనెల 25వ తేదీ నుండి పశుగణన చేపట్టనున్నారు. జిల్లాలోని పశు వుల సంఖ్య తేల్చేందకు పశుసంవర్ధకశాఖ అన్ని ఏర్పాట్లు చేపడుతోంది. ఇందు కోసం జిల్లా పశు సంవర్ధశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్ జిల్లాలోని పశువైద్య అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి 21వ అఖిలభాతర పశుగణన అవశ్యకతను వివరించడంతో పాటు జిల్లాలో నిర్వహించాల్సిన తీరును వివరించారు. ఈనెల 6 నుండి 13వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. నాలుగు నెలల పాటు జిల్లాలో పశుగణన చేపట్టనున్నారు. ఈనెల 25వ తేదీ నుండి చేపట్టనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని 32 మండలాలకు 384 మంది గణనకర్తలు, 67 మంది సూపర్వైజర్లను నియమించారు.

పశుగణనలో భాగంగా గ్రామాల్లోని ప్రతి నివాసాన్ని ఎన్యుమరేటర్లు సందర్శిసారు. గేదెలు, ఆవులు, వాటి జాతులు, కోళ్ల జాతి, రకాలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు ఎన్ని ఉన్నాయనే సంఖ్యను నమోదు చేస్తారు. 988 గ్రామాలు, వార్డులకు 384 మంది గణన కర్త లను నియమించారు. 76 మంది సూపరు వైజర్లను నియమించారు. 25వ నుండి నిర్వహించే పశుగణనలో ఈ ఏడాది ఎన్యమనేటర్ ఫోన్ లోనే యాప్ ద్వారా ఎన్యుమనేషన్ నిర్వహించనున్నారు. జిల్లాలో 4,60,076 నివాసాల్లో గణన చేపట్ట నున్నారు.

పశుగణన ఆధారంగానే జిల్లాకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ రానుంది. పశువుల సంఖ్యను బట్టే వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు సరఫరా చేస్తారు. ప్రభుత్వ పథకాలు ప్రణాళికల అమలు కోసం పరిశోధన ప్రాంతాల అభివృద్ధి కోసం రైతులు కచ్చితమైన సమాచారం గణన కర్తకు అందజేయాలి.

టపాకాయల విక్రయ స్థలం పరిశీలన

టపాకాయల విక్రయ స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: దీపావళి పండగను పురస్కరించుకుని టపాకాయల విక్రయ స్థలాన్ని తహశీల్దారు బాబూ రాజేంద్రప్రసాద్ బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో టపాకాయలు విక్రయించేందుకు అనుమతులు మంజూరు చేస్తామని, అనుమతులు పొందిన టపాకాయల విక్రయదారులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో పునీత్ పాల్గొన్నారు.

రైతులు ఆధైర్యపడొద్దు: తహశీల్దారు

రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రైతులెవరు అధైర్యపడొద్దని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని బేరిపల్లి రెవెన్యూ గ్రామసభ వీఆర్‌వో హేమచంద్ర ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆన్‌లైనులో తప్పిదాల వల్ల ఒకరి భూమి మరొకరికి నమోదు అయిందని తప్పులున్న రైతులు గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకుంటే తిరిగి సర్వే చేపట్టి వారి పేరుతో భూములు తిరిగి నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు బాబు, సర్వేయర్ లావణ్య, సచివాలయ సర్వేయర్ ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

వైసిపి నాయకుని తల్లికి నివాళి

ప్రజాశక్తి -విజయపురం (నగరి): నగరి రూరల్ మండలం నగరాజుకుప్పం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు శేఖర్ తల్లి ఆకస్మిక మృతి చెందింది. మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరులు వై రాంప్రసాద్ రెడ్డి బుధవారం శేఖర్ ఇంటికి వెళ్లి అతని తల్లి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టిక ఆహారం పంపిణీ

విద్యార్థులకు పౌష్టిక ఆహారం పంపిణీ చేస్తున్న దాత

ప్రజాశక్తి -పలమనేరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం ఎంఈవో పి లీలారాణి ఆధ్వర్యంలో శుభ్‌దిన్ భోజన కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు ఎం పుష్పావతి దాతృత్వంతో విద్యార్థులకు ప్రత్యేక వంటకాలతో పౌష్టికాహార భోజనాలు ఏర్పాటు చేసినందుకు ఆమెను మండల విద్యాశాఖ తరుపున అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ పి లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం
వరిమడి నేలమట్టం


గాలివాన బీభత్సానికి నేలమట్టమైన వరిమడి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలో బుధవారం కురిసిన గాలివాన బీభత్సానికి వరిమడి నేల మట్టమైంది. మండలంలోని గంగి నాయన పల్లి రెవెన్యూ పరిధిలోని మునెమ్మ వరిమడి గాలివాన బీభత్సానికి సుమారు 1.75 ఎకరాల కోత దశలో ఉన్న వరిమడి నేలమట్టమైంది. తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వారు స్పందించి తగిన నష్టపరిహారం అందించాలని బాధితురాలు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఐ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: మురికి వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పార్టీలకు అతీతంగా సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక బెరినగరిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని మురికివాడల్లో తాగునీరు, మురుగునీటి కాలువలు, వీధిలైట్లు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ జోక్యం చేసుకుని నిరుపేదలు నివాసం ఉంటున్న కాలనీపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట ప్రభుత్వ జడ్పీహెచ్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరానికి సమీప గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన వచ్చినట్లు తిరుమల డెయిరీ రీజనల్ మేనేజర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. కుప్పం పీఈఎస్ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో విద్యార్థులు 88 మంది, 216 మంది రైతులకు కంటి చికిత్స తో పాటు, వివిధ రకాల చికిత్సలు అందించారు. కంటి ఆపరేషన్లకు పది మందిని రెఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. సాధారణ అనారోగ్యాలు ఉన్న వారికి అక్కడే ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కెవి రాజమ్మ, వైద్యాధికారులు సూర్యతంత్, రూపారాణి, జెస్సికా, చంద్రశేఖర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రత్నమ్మ పాల్గొన్నారు.

ఆర్‌టిఐ మేరకు సమాచారం ఇవ్వాలి..
- నగర డివిజన్ వ్యవసాయ శాఖ ఏడి సౌభాగ్య లక్ష్మి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఆర్‌టిఐ చట్టం కింద నమోదు చేసుకున్న ప్రతి శాఖ పరంగా ప్రజలు అడిగే సమాచారం ఇవ్వాలని నగరి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడి సౌభాగ్య లక్ష్మి ఆదేశించారు. గంగాధర నెల్లూరు అగ్రికల్చర్ ఆఫీసులో బుధవారం సమాచార హక్కు చట్టం- 2005 పై మండలంలోని రైతులకు రైతు సేవా కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి ఆ శాఖ ఏడీ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార యంత్రాంగంలో ప్రతి ఒక్కరూ పారదర్శక, జవాబు దారీ తనం కలిగి ఉండాలన్నారు. అవినీతి అరికట్టాలన్న, ప్రజాస్వామ్యం సవ్యంగా పని చేయాలన్న ప్రభుత్వ పరంగా ప్రజలు విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి భవాని, నర్సద, ఢిల్లీ ప్రసాద్ పాల్గొన్నారు.

భూ సమస్య తనిఖీ

భూ సేకరణపై రైతులతో చర్చిస్తున్న ఆర్‌డిఓ శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: స్పందన లో తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రామకృష్ణాపురం గ్రామానికి రైతు ఇచ్చిన అర్జీ పరిశీలనలో భాగంగా చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు రామకృష్ణాపురానికి బుధవారం వచ్చారు. రైతు పొలం వద్దకు వెళ్లి అర్జీ దారు ని అడిగి సమస్య తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఆ పొలం అర్జీదారు తాత పేరుతో ఉండడం, ఆన్‌లైన్‌లో ఈ నెంబరు లేకపోవడంతో భూమిని సాగు చేస్తున్న రైతులను విచారించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భూములను ప్రస్తుతం అనుభవిస్తున్న వారి పేరుతో చట్ట ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహశీల్దారు లోకనాథ్‌రెడ్డికి సూచించారు. ఈ ఆర్‌డిఓ అధికారులు జాతీయ హైవే రోడ్డు అధికారులు, తహశీల్దార్, రెవెన్యూ సిబ్బందితో కలిసి చిత్తూరు - తచూర్ రోడ్డు ఏర్పాటు నిమిత్తం భూ సేకరణ దాదాపు 35 మంది రైతులతో చర్చించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రమైన రామకుప్పం లోని టీడీపీ కార్యకర్త ముబారక్ తల్లి రజియాబీ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, సలాం సాబ్, నియాజ్, టీవీ రవి, విజయకుమార్ రెడ్డి, మంజునాథ్, బాలరాజు, తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి పార్టీ తరఫున పది వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.

పారిశుధ్యం, స్వచ్ఛ తాగునీటి సరఫరాపై దృష్టి సారించండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈఓపిఆర్‌డిలు, పంచాయతీ సెక్రటరీలు మెరుగైన పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టి పని చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, మండల స్థాయిలో ఈఓపీఆర్‌డిలు, హౌసింగ్, పి ఆర్‌పి డిపి లు ఏ ఏ లతో గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా పని దినాల కల్పన, ఉపాధి నిధులతో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణ పురోగతి, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహ నిర్మాణ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పి ఆర్ వన్ యాప్‌లో భాగంగా పొదల తొలగింపు, చెత్త దిబ్బల తొలగింపు, మురుగునీరు నిలిచి ఉన్న కాలువల శుభ్రత, రక్షిత మంచినీటి ట్యాంకులు పరిశుభ్రత, క్లోరినేషన్ సంబంధిత అంశాలకు సంబంధించి ఎప్పటికప్పుడు యాప్ లో నమోదయ్యే అంశాలపై మండల స్థాయిలో ఈవోపీఆర్డీలు పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక దృష్టి పెట్టి పని చేయాలన్నారు. వర్షాల కారణంగా ప్రబలే వ్యాధులను అరికట్టేందుకు మెరుగైన పారిశుధ్య నిర్వహణను చేపట్టాలన్నారు. ప్రజలకు సురక్షిత మంచి నీటిని అందించడంలో భాగంగా రక్షిత మంచినీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, తద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పన్నుల వసూళ్ల ప్రక్రియకూ అధిక ప్రాధాన్యత నిచ్చి గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు.

నవంబర్ 27లోపు సాగునీటి సంఘాలు ఏర్పాటు
ఇరిగేషన్ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న ఇరిగేషన్‌ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ నిబంధనల మేరకు ఈనెల 21 నుంచి నవంబర్ 27వ తేదీ లోపు సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ విజయ కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 220 సాగునీటి సంఘాలు వున్నట్లు తెలిపారు. కృష్ణాపురం ప్రాజెక్టు ఆయకట్టుదారుల సాగునీటి కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తవణంపల్లి, బంగారుపాళ్యం మండలాల్లో ఒకే రోజు అధికవర్షం కురవడంతో తవణంపల్లి మండలంలో కల్వర్టులు కొట్టుకుపోయిందని యుద్ధప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం ఎన్‌టిఆర్ జలాశయం నిండిపోవడంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారన్నారు. డిసెంబర్ వరకు వర్షాలకు కురిసే అవకాశం ఉండటంతో ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకుటున్నట్లు చెప్పారు. 2015లో ఎన్‌టిఆర్ జలాశయం పూర్తి స్థాయిలో నిడిందని తరువాత 9 సంవత్సరాల తరువాత ఎన్‌టిఆర్ జలాశయం పూర్తి స్థాయిలో జలకళ సంతరించుకుందన్నారు. రూ.175 కోట్లతో నీవానది ప్రొడెక్షన్ వాల్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అడవిపల్లి రిజర్వాయర్ నుండి పైపులైన్ ద్వారా ఎన్‌టిఆర్ జలాశయం నీటి తరలింపు పనులు దాదాపు పూర్తిచేశారని చిన్నమండ్యం, శ్రీనివాసపురం రిజర్వాయర్ నుండి అడవిపల్లికి నీటిని తరలించి అక్కడి నుండీ ఎన్‌టిఆర్ జలాశయం వరకు నీటి తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని దాదాపు మైనర్, మేజర్ చెరువుల్లో వర్షపు నీరు వచ్చి చేరిందని ఎక్కడా చెరువు కట్టలు, చెక్ డ్యాములు తెగే పరిస్థితి లేదన్నారు. ఎప్పటికప్పుడు జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

ప్రజాస్వామ్య నిర్మాణంలో యువత పాత్ర కీలకం

మాట్లాడుతున్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి -విజయపురం (నగరి): శక్తివంతమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించడంలో యువత పాత్ర కీలకమైందని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వేణుగోపాల్ తెలిపారు. కళాశాలలో నగరి మునిసిపల్ కమిషనర్ , కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన నూతన ఓటర్ల నమోదుపై అవగాహన, కార్యాచరణ అనే అంశంపై ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కావడానికి ఓటరుగా నమోదు కావడం మొదటి మెట్టు అని ప్రిన్సిపాల్ తెలిపారు. యువత ఓటును తెలివిగా, అవగాహనతో, మార్పును, సంస్కరణలను ఆశిస్తూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు వెంటనే ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నగరి మునిసిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాల వారు ఓటరు నమోదుకు సిద్ధం కావాలని, 18 ఇప్పటికీ ఓటరుగా నమోదు కాని వారు బిఎల్ ఓ ద్వారా వెంటనే నమోదు చేయించుకోవాలని కోరారు. ఇందుకు కావలసిన పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఫొటో తీసుకురావాలని కోరారు. ఎన్నికలలో నిష్పక్షపాతంగా, డబ్బు, మద్యం, కులం, మతం, ప్రాంతం, బంధుత్వం వంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. నగరి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్మాణంలో యువత నిర్ణాయక పాత్ర కలిగి ఉంటుందని, ఫారం 6 ను కేంద్ర ఎన్నికల సంఘం. నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్ డబ్ల్యుడబ్ల్యు పోర్టర్ హెల్ప్‌లైన్ ద్వారా లేదా బూత్ లెవెల్ ఆఫీసర్ ద్వారా ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కర రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని మార్చడం లేదా కొనసాగించడం రాజ్యాంగం కల్పించిన ఓటు ద్వారానే సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. కళాశాల ఎన్‌సిసి ప్రోగ్రాం ఆఫీసర్ గోపి మాట్లాడుతూ ఓటు హక్కు ఒకప్పుడు కేవలం పన్నుచెల్లింపు దార్లు, ఉన్నత విద్యావంతులకే ఉండేదని కానీ నేటి ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన భారత పౌరులందరికీ ఓటుహక్కు పొందడం రాజ్యాంగా హక్కుగా లభించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నగరి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ యువరాజ్, కళాశాల అధ్యాపక బృందం, మునిసిపల్ ఆఫీసు సిబ్బంది అక్బర్, ఇతర సిబ్బంది, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు

అభివృద్ధిలో అలసత్వం వద్దు
- సమస్యలపై తక్షణమే స్పందించాలి
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: అభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, సమస్యలపై తక్షణమే స్పందించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులను ఆదేశించారు. పలమనేరు పట్టణంలోని తన కార్యాలయంలో నియోజక వర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో తాగునీరు, మరుగుదొడ్లు, రహదారులు, పైప్ లైన్ పనులు తదితర అంశాలపై ఆయన మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తున్నప్పటికి పలువురు అధికారులు అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తుండడం పై ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనులలో జాప్యం చేయొద్దని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. గ్రామాలలో సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులపై త్వరలోనే పురోగతి సాధించి గ్రామాలలో మార్పు స్పష్టం గా కనిపించాలని అలసత్వం వహించే అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల స్థాయిలో ఏదైనా దీర్ఘ కాలం గా నెలకొన్న సమస్యలు వుంటే తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు బాలాజీ, ఖాదర్ బాషా, సురేష్, రాజేంద్ర బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ స్టాలిన్, పీఆర్‌డిఈ మహేష్‌లతో పాటు ఏఈ లు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు: తహశీల్దారు

ప్రజాశక్తి- తవణంపల్లి: భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తవణంపల్లి తహశీల్దారు సుధాకర్ తెలిపారు. బుధవారం తవణంపల్లి మండల పరిధిలోని టీ పుత్తూరులో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ మురళీకృష్ణ గ్రామ సర్వేయర్ రీ సర్వేలో భాగంగా భూ సేకరణ, భూ సమస్యలకు సంబంధించి రైతులు, భూ యజమానుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రీ సర్వే పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి , గ్రామ సర్పంచ్, వీఆర్వో లు సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- సదుం: మండల పరిధిలోని రైతుల భూముల సమస్యలపై గ్రామ సభల ద్వారా రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్నామని, అర్జీలు ఇచ్చిన రైతులందరి భూ సమస్యలను మండల రెవెన్యూ యంత్రాంగం రైతులను సమన్వయం చేసుకొని, భూ సమస్యలను పరిష్కరిస్తామని మండల తహశీల్దారు మారూఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం నడిగడ్డలో నిర్వహించిన గ్రామసభలో తహశీల్దారు మారూఫ్ హుస్సేన్ పాల్గొన్నారు. రైతుల నుండీ భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఈశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు పవన్ కుమార్ రెడ్డి, భువన్ కుమార్, ఆనంద్, డీలర్ రవీంద్రనాథ్ రెడ్డి, వార్డు సభ్యులు,వి ఆర్వో బాష సర్వేయర్ పవన్, హెడ్ కానిస్టేబుల్ సత్యానారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి: ఎంపిడివో

ఎంఎఫ్‌ఎం చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపిడివో వేణు

ప్రజాశక్తి - యాదమరి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపిడివో వేణు పేర్కొన్నారు. సుచి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సుచి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పాల్ విజయ్ కుమార్ గ్లోరీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంఎఫ్‌ఎం చెక్కుల పంపిణీని బుధవారం నిర్వహించారు. జోడి చింతల సుచి సంస్థ కార్యాలయంలో ఎంపిడివో వేణు చేతులు మీదుగా 12 మందికి రూ.20 వేలు చొప్పున రెండు లక్షల 40 వేలు రూపాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి చెంది వారి కుటుంబాలు అన్ని విధాల అభివృద్ధి చెందేందుకు ఇది తోడ్పడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద మహిళలకు స్వచ్ఛంద సంస్థ ఆర్థిక అభివృద్ధి చెందేందుకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళలు ప్రతి ఒక్క రూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుచి స్వచ్ఛంద సంస్థ సిబ్బంది ధనలక్ష్మి, జాన్సన్, వరదరాజులు, జాకబ్, డి చిన్నయ్య , ఎం మణి, మహిళలు పాల్గొన్నారు.

బీరప్ప చెరువుకు జలహారతి

జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి -ఐరాల: ఐరాల మండలం బీరప్ప చెరువుకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ బుధవారం జలహారతి నిర్వహించారు. స్థానిక మండల నాయకులు, అధికారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీరప్ప చెరువు మొరవ వద్ద ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా పూతలపట్టు నియోజకవర్గంలో కురుస్తున్న వర్షాలకు కొన్ని గ్రామాల్లోని చెరువులు నిండి పొంగి ప్రవహిస్తున్నాయని, చంద్రబాబు సీఎం కాగానే సంవృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు నీటి కరువు తీరిపోయిందన్నారు. ఐరాల మండలంలోనే పెద్ద చెరువు అయిన బీరప్ప చెరువు జలకళ సంతరించుకోవడంతో బీరప్ప చెరువు వద్ద ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చామన్నారు. గతంలో చెరువులను అభివృద్ధి చేసింది టీటీడీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో సరైన మరమ్మతులు లేక చెరువులు ఆనకట్టలు, తూములు దెబ్బ తిన్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందన్నారు. చెరువులకు గండి పడకుండా, తూముల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూమిలో నీటి సామర్థ్యం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై అధికారులకు సూచనలు చేసామని, వీలైనంత త్వరగా చెరువుల మరమ్మతులు పూర్తి చేసి, బలోపేతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కరువు
మూసివేత దిశగా పలు పాఠశాలలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: 'ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయండి, ప్రభుత్వపాఠశాలల్లో హాజరు పెంచండి..' అంటూ ప్రభుత్వం సూచనలు చేసినా మండలంలోని విద్యాశాఖ అధికారులు అనుసరిస్తున్న తీరు పలు విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు అన్ని వసతులు ఉన్నా పాఠశాలల్లో విద్యార్థుల శాతం ఆశించిన స్థాయిలో లేదని పలు పాఠశాలలు మూసివేత దిశగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడికి పోదాం, విద్యాప్రవేశం వంటి కార్యక్రమా లను మండల స్థాయిలో తూతూ మంత్రంగా నిర్వహించి కేవలం ఫొటోలకు మాత్రమే ఫోజులు ఇస్తున్నారు.. కానీ ఆశించిన స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో డ్రాపౌట్స్ నియంత్రణ విద్యార్థులను చేర్పించటం జరగలేదనే విమర్శలు వినిపి స్తున్నాయి. మండలంలో కూరగాయల కొత్తపల్లి, నగిరెపల్లి, చీకలదిన్నేపల్లి, చెన్నారెడ్డిపల్లి, వలసపల్లి, చిన్న వెలగటూరు కంగాణం బండ గ్రామాలలోని పాఠశాలలు పిల్లలు హాజరు సరిగా లేక మూసివేత దిశగా ఉన్నాయని మండలంలో తీవ్రంగా చర్చించుకుంటున్నారు. విద్యాశాఖపై ప్రజా ప్రతి నిధులు మండిపడినా పెద్దపంజాణి మండల విద్యాశాఖ అధికారులలో మార్పు లేదనే విషయం తెలుస్తోంది. విద్యార్థుల హాజరు సరిగా లేని గ్రామాలలో ప్రభుత్వ బడులలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించలేక పోవడం, ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టినా మండల స్థాయిలో జిల్లా మండల విద్యాశాఖ అధికారులు కేవలం ఫొటోలకు మాత్రమే పరిమితమై ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థు లను చేర్పించడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా కారణమని కూడా పాఠశా ల పరిధిలోని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

క్రైం న్యూస్

300 సెల్ ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వివిధ వ్యక్తులు పోగొట్టుకున్న సెల్ ఫోన్లను చాట్ బాట్ యాప్ ద్వారా రూ.65 లక్షల విలువచేసే 300 సెల్ ఫోన్లు 9వ విడతలో స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి మణికంఠ చందోలు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీసు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ చాట్‌బాట్ యాప్ అందిస్తున్న సేవలను తెలిపారు. పోగొట్టుకుని చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీలో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన యాప్ ద్వారా సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అందిస్తున్నామని తెలిపారు. 9 విడతల్లో యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన వారికి సెల్‌ఫోన్లు రికవరీ చేసి అందించామన్నారు.

'అయోడిన్ ఉప్పు వాడకం తప్పనిసరి'

అయోడిన్ ఉప్పు ప్రాధాన్యతను వివరిస్తున్న వైద్యాధికారిణి

ప్రజాశక్తి -సోమల: ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ ఉప్పు వాడటం వల్ల అనేక వ్యాధుల నుండి అనారోగ్య పరిస్థితుల నుండి కాపాడుకోవచ్చునని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి సోనియా అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులు, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, విరేచనాలు అయినప్పుడు ఓఆర్ఎస్ ద్రావణాన్ని వైద్యులు సూచించిన మేర తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమల నివారణకు వేపాకు పొగను ఇంటిలో వేసుకోవాలని సూచించారు. దోమతెరలు వాడాలని కోరారు. ముఖ్యంగా రోజువారి ఆహారంలో అయోడిన్ లోపం వల్ల థైరాయిడ్ సమస్యలు, గర్భస్రావం, వినికిడి సమస్యలు బుద్ధిమాంద్యం కలుగుతాయని వీటి నివారణ కోసం ప్రతి రోజూ ఆహారంలో అయోడైజ్డ్ ఉప్పు వాడాలని కోరారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ సచివాలయం వద్ద గర్భవతులు ,బాలింతలకు, చిన్నారులకు వైద్య పరీక్షలను నిర్వహించి వారికి నెలవారి ఇచ్చే రోగ నిరోధక టీకాలను వైద్య సిబ్బంది అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.10 నాణేలపై అవగాహన

రూ.10 నాణేలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి-గుడిపల్లి: రూ.10 నాణేల చెల్లుబాటుపై గుడుపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరేంద్ర, క్యాషియర్ సురేష్‌లు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, కరపత్రాలను పంచి విస్తృత ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ రూ.10 నాణేలను తీసుకోవాలని, దుకాణాలు, ఆటో, బస్సు, హోటల్‌లలో రూ.10 నాణేలు చెల్లు బాటు అవుతాయని వారు ప్రజలకు తెలిపారు.

ఆరిమాని గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఆలయ హుండీని లెక్కిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని వివిపురం గ్రామ పంచాయతీలో గంగమ్మ గుడి గ్రామంలోని ఆరిమాని గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు బుధవారం ఆలయ నిర్వహణ అధికారి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూలై 4వ తేదీ నుండి బుధవారం వరకు భక్తులు హుండీలో వేసిన కానుకలను పాలకమండలి కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించామన్నారు. హుండి ద్వారా రూ.1,75,590 ఆదాయం వచ్చిందని తెలిపారు. శ్రీ ఆరిమాని గంగమ్మ దసరా మహోత్సవాల సందర్భంగా హుండీ లెక్కింపు లో అమ్మవారికి ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ లింగారెడ్డి , వెంకటా చలపతి ఆచార్యులు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గట్ల వీఆర్‌వో పురుషోత్తం బాధ్యతల స్వీకరణ

వీఆర్వో ఎస్ పురుషోత్తం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని వల్లిగట్ల వీఆర్వోగా ఎస్ పురుషోత్తం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సదుం మండలంలో విఆర్‌ఓ గా బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీపై సోమల మండలం వలిగట్ల విఆర్‌ఓ గా వచ్చారు. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి1 వీఆర్వో గా ఎం రామస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సదుం మండలం నుండి బదిలీపై వచ్చారు.

వర్షపు నీరు తొలగింపు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మ గారి పల్లి వద్ద వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో తహశీల్దారు బెన్నురాజ్ గ్రామానికి వెళ్లి నీరు పారేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టు మూసుకుపోవడంతో సమస్యను గుర్తించారు. కల్వర్టు కింద మట్టిని తొలగించి నీటిని సజావుగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు రెవెన్యూ సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.P. No. 8/2024

Between:

Sri Akula Srinivasa Rao, S/o. Satyanarayana, resident of D.No. 102-5-437, Block No.5, S.T.B.L.Gated Community, Venkatadri Gardens, Bommuru, Rajamahendravaram Rural, East Godavari District and R.J.C.J.C.

...Petitinoer

AND

Vanemreddi Shyam Phani & Others

...Respondents

R-5: Yenduluri Praneeth, S/o. Not known, male, Hindu, aged 40 years, Business, resident of D.No. 504, Srinivasa Enclave, Near A.G.College, Peruru, Tirupathi Rural, Chittor District and Tirupathi J.C.J.C.

5th...Respondent

పై నెంబరు పిటిషన్‌లో 5వ, రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **05-11-2024** సం॥రం తేదీ **ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి ఎ.సునీల్

23-10-2024 అడ్వకేట్, రాజమండ్రి

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE, CHITTOOR

Tr.O.P.No.492 of 2023

Between:

S.Yasaswni Priayanka ... Petitioner.

And:

Budur Mukesh ... Respondent.

NOTICE TO THE RESPONDENT

To

Budur Mukesh S/o B.Subramanyam, D.No:27-133/I, Ram Nagar Colony, Chittoor town & District,

Please take notice that the petitioner filed the above petition to transfer H.M.O.P.No. 143 of 2023 on the file Prl., Senior Civil Judge's court, Chittoor to the Hon'ble V Additional District Judge's court, Tirupati (family court) against you in order to try the same along with F.C.O.P.No. 173 of 2023. The said petition stands posted to **07.11.2024** for your appearance before the above said Hon'ble Court. Please attend before the above said Court on 07.11.2024 at 10-30 a.m. either in person or through your counsel and to file your objections if any, failing which the matter will be decided exparte.

C. SURESH REDDY,

Advocate for Petitioner

Place: Chittoor, Date:22.10.2024